సాక్షి విజయనగరం

శుక్రవారం । 25 । జూలై । 2025



'యూనాని'కి స్వీపరే దిక్కు..!
ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో యూనాని విభాగానికి వైద్యులు లేరు. అక్కడి స్వీపరే డాక్టర్‌లా మందులు ఇస్తున్నారు. - 8లో



ఈగల్ టీమ్‌కు చిక్కిన గంజాయి నిందితులు - 8లో
మూడు కార్లలో 120 కేజీల గంజాయిని రవాణా చేస్తున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు.



సాగు భూమిని ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారు..! - 8లో
సాగులో ఉన్న భూమిని ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారని కాకర్లవలస రైతులు ప్రశ్నించారు.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ప్రొబెషనరీ ఎస్‌ఐలు



ఎస్పీ వకుల్ జిందల్‌ను కలిసిన ప్రొబెషనరీ ఎస్‌ఐలు

విజయనగరం క్రైమ్: అనంతపురం పోలీస్ శిక్షణ కళాశాలలో ట్రైనింగ్ పూర్తి చేసుకుని క్షేత్ర స్థాయిలో పోలీస్ విధులపై అవగాహన పెంచుకునేందుకు వచ్చిన నలుగురు ప్రొబెషనరీ ఎస్‌ఐలు ఎస్పీ వకుల్ జిందల్‌ను ఆయన చాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్ర స్థాయిలో విధి నిర్వహణ, పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తుపై అవగాహన పెంచుకోవాలని వారికి ఎస్పీ వకుల్ జిందల్ దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాతత్పరతో ప్రజలకు నిస్వార్థమైన సేవలందించాలన్నారు. శిక్షణ తీరును ప్రొబెషనరీ ఎస్‌ఐలు బి.సాయిరాం పడాల్, పి.నాని, కె.సాయిరాం, కె.దుర్గాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని నేరాలను కట్టడిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.గోపాలనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పే సమయమేది?



ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లాల గౌరవాధ్యక్షుడు జోగినాయుడు

బొబ్బిలిరూరల్: ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన విద్యా విధానాలు, వివిధ యాప్‌లతో తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయమే ఉపాధ్యాయులకు ఉండడం లేదని ఏపీటీఎఫ్ ఉమ్మడి విజయనగరం జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. బొబ్బిలి ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. వెబెక్స్, వివిధ శిక్షణలు, ఆన్‌లైన్ యాప్‌లు, ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారాలకు ఉపాధ్యాయులను ప్రభుత్వం వినియోగిస్తుంటే బోధన ఎలా సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓ ప్రకారం పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధన వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిందని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని, ప్రస్తుతం ఈ విద్యాసంవత్సరంలో దాదాపు పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారని, ఇది దేనికి సంకేతమని ప్రశ్నించారు. బోధనేతర వ్యవహారాలతో ప్రభుత్వ బడుల్లో బోధన సరిగా సాగక విద్యార్థులు ప్రైవేటు బాటపడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం 19, 20, 21 జీఓల ద్వారా చేపట్టిన పాఠశాలల వర్గీకరణ, హేతుబద్ధీకరణ చట్టవిరుద్ధమని, వెంటనే ప్రభుత్వం వాటిని సరిదిద్దాలని ఆయన డిమాండ్ చేశారు.

డబ్ల్యూఏఐఓటీలో ఎస్.కోట డాక్టర్ ప్రసంగం



జపాన్‌లో నిర్వహించిన వైద్యసదస్సులో జ్ఞాపిక అందుకుంటున్న రామకార్తీక్

శృంగవరపుకోట: జపాన్‌లో డబ్ల్యూఏఐఓటీ (వరల్డ్ ఎగినిస్ట్ ఇన్‌ఫెక్షన్స్ ఇన్ ఆర్థోపెడిక్స్ ఎండ్ ట్రామా) అనే అంశంపై విస్తృత స్థాయి వైద్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు భారతదేశం నుంచి ఇద్దరు వైద్యులకు అవకాశం దక్కగా, వారిలో ముంబై హిందుజా గ్రూప్ నుంచి ఒకరు, ఎస్.కోటకు చెందిన ఆర్.రామకార్తీక్ ఉన్నారు. బోన్ ఇన్‌ఫెక్షన్‌కి సంబంధించిన అంశంపై వందలాది మంది వైద్యుల సదస్సులో ప్రసగించడం ఆనందంగా ఉందన్నారు.

ఆ నిధులు ఏమయ్యాయి?



డాక్టర్ తలే రాజేష్

రాజాం: కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రంలోని పంచాయతీలకు ఏడు నెలల కిందట రూ.1,212 కోట్ల నిధులు విడుదల కాగా, ఇంతవరకు పంచాయతీలకు జమకాలేదని, ఆ నిధులు ఎటు వెళ్లాయో చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన నిధులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సినిమా చిత్రీకరించేవారికి రూ.2ల వడ్డీకి అప్పుఇచ్చారని అనుమానించాల్సి వస్తోందన్నారు. పంచాయతీల్లో పడకేసిన అభివృద్ధిపై పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించాలన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా కూటమి సాధించిన ఘనతేమీ లేదని విమర్శించారు.



చిత్రంలోని వృద్ధురాలి పేరు కలిపిండి సీతమ్మ. రామభద్రపురం మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ. ఆమె భర్త బంగారునాయుడు వృద్ధాప్య పింఛన్ అందుకుంటూ 15 నెలల కిందట మృతి చెందాడు. ఆమె కుమారుడు కూడా నాలుగేళ్ల కిందట చనిపోయాడు. ఆమెకు ఏ ఆధారమూ లేదు. ప్రభుత్వం స్పౌజ్ పింఛన్లకు అవకాశం ఇవ్వడంతో దరఖాస్తు చేసుకోగా పింఛన్ మంజూరైనట్టు జాబితాలో పేరుంది. నెలలు గడుస్తున్నా చేతికి మాత్రం డబ్బులు అందలేదు. గతనెల ఇస్తామని సచివాలయ సిబ్బంది చెప్పారు. ప్రభుత్వం వద్దనడంతో మానేశారు. పింఛన్ డబ్బుల కోసం ఆమె ఆశగా ఎదురుచూస్తోంది.





ఈ చిత్రంలో నిరాశగా కూర్చున్న మహిళపేరు సిరిపురం అప్పలరాము. రామభద్రపురం మండలం కొండకెంగువ గ్రామం. ఈమె భర్త సింహాచలం వృద్ధాప్య పింఛన్ అందుకుంటూ ఏడాదిన్నర క్రితం మృతిచెందాడు. గత నెలలోనే పింఛన్ మంజూరైందని చెప్పినా చేతికి డబ్బులు అందలేదు. వచ్చేనెలలోనైనా ఇస్తారోలేదోనని బెంగపడుతోంది.

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ...



- పింఛన్ డబ్బుల కోసం వితంతువుల ఎదురుచూపు
- జిల్లా వ్యాప్తంగా 3,419 మందికి మంజూరైన స్పౌజ్ పింఛన్లు
- జూలై నెలలో అందని డబ్బులు
- వచ్చేనెలా అందుతాయోలేదోనన్న బెంగ

రామభద్రపురం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తయింది. ఇప్పటివరకు ఏ సంక్షేమ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసిన దాఖాలా లేవు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు పథకాల అములులో చేతులెత్తేస్తున్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాతసుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలు అటకెక్కగా.. భర్తలు కోల్పోయిన మహిళలను ఆదుకోవడంలోనూ కూటమి ప్రభుత్వం విఫలమైంది. పింఛన్ ఇస్తామని ఊరిస్తూ ఉసూరుమనిపిస్తోంది. దరఖాస్తు చేసి నెలలతరబడి ఎదురుచూస్తున్నా పింఛన్ డబ్బులు చేతికందని పరిస్థితి. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీలో పింఛన్ మంజూరుకు అర్హులుగా నిర్ధారించారు. జిల్లా వ్యాప్తంగా 3,419 మందికి స్పౌజ్ కేటగిరీలో పింఛన్లు మంజూరు చేశారు. వీరికి జూన్ 12వ తేదీన కూటమి ప్రభుత్వం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పింఛన్లు అందజేస్తామని ప్రకటించారు. అయితే, అనివార్య కారణాలతో పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. జూలై 1న పంపిణీ చేయాలని రూ.1,36,76,000 నిధులు విడుదలచేసినా లబ్ధిదారుల చేతికి అందలేదు. తిరిగి ఆ నిధులను ప్రభుత్వం వెనుకకు తీసుకోవడంతో నిరాశ తప్పలేదు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత మేరకు ప్రతి ఆరునెలలకోసారి కొత్తపింఛన్లు మంజూరయ్యేవని, పింఛన్ డబ్బులు ఠంచన్‌గా అందేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతీ పథకం అమలులోనూ కుతంత్రమే కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి(ఫైల్)

కూలికి వెళ్తున్నా..

భర్త మంగయ్య ఏడాదిన్నర కిందట చనిపోయాడు. పిల్లలు లేరు. ఒంటరిదాన్ని అయ్యాను. పింఛన్ ఇస్తామని చెబుతున్నారే తప్ప ఇవ్వడం లేదు. ఆకలి తీర్చుకునేందుకు కూలికి వెళ్తున్నా. పింఛన్ వస్తే కాస్త ఆర్థిక భరోసా కలుగుతుంది.
– పొగందర తవిటమ్మ, కొండకెంగువ

త్వరలోనే పంపిణీ చేస్తాం..


స్పౌజ్ పింఛన్ల లబ్ధిదారులకు జూలై నెలలో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అనివార్య కారణాలతో మళ్లీ డేట్ ఇస్తామని పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం త్వరలోనే స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తాం.
– సీహెచ్ రత్నం, ఎంపీడీఓ, రామభద్రపురం

శ్రీరస్తు... శుభమస్తు..

- నేటి నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసం
- నెలరోజుల పాటు పెళ్లిళ్లు, నోములు, వ్రతాలతో సందడే సందడి
- పుంజుకోనున్న అనుబంధ వ్యాపారాలు



విజయనగరం: శ్రావణ మాసం శుక్రవారం ఆరంభం కానుంది. మంచిరోజులు రావడంతో పల్లెలు, పట్టణాల్లో పెళ్లి బాజాలు మోగడంతో పాటు ఇతర శుభకార్యాలు జోరందుకోనున్నాయి. మే 24 నుంచి మంచి ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలు చేసుకునే వారు ఇప్పటివరకు నిరీక్షించారు. ఈ నెల 24తో ఆషాఢం ముగిసింది. 25 నుంచి శ్రావణం ప్రారంభం కానుండడంతో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 26, 30, 31, ఆగస్టు 1, 3, 4, 6, 10, 13, 15, 17, 18 తేదీల్లో శుభ ముహూర్తాలున్నట్లు పండితులు చెబుతున్నారు. ఆ మేరకు కల్యాణ మండపాలు, ఆలయాల ప్రాంగణాలను ముస్తాబు చేస్తున్నారు.



అమ్మవారి వ్రతాలకు శుభసమయం
పెళ్లిళ్లతో పాటు ఇళ్లలో నోములు, మంగళగౌరి, వరలక్ష్మి వ్రతాలకు శ్రావణమాసం శుభసమయం. ఇదే నెలలో అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పిస్తారు. మహిళలు అత్యంత భక్తితో అమ్మవారిని ఆరాధించే పూజల మాసమని దీనికి ప్రసిద్ధి. ఇంటినే దేవాలయంగా భావించి మామిడికొమ్మలతో అలంకరిస్తారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వ్రతాలు ఆచరిస్తారు. చీరలు, నగలతో సుందరంగా అలంకరిస్తారు. అమ్మవార్లకు పసుపుకుంకుమలు సమర్పిస్తారు. వివిధ రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉపవాసం చేస్తూ అమ్మవారిని భక్తి శ్రద్ధలతో కొలుస్తారు.

వారికి మంచి కాలం ఇది...
శ్రావణమాసం పలు వర్గాలకు సిరులు కురిపిస్తుంది. పెళ్లిళ్లకు అవసరమైన ఫంక్షన్ హాళ్లు, టెంట్లు, సౌండ్ సిస్టం, బ్యాండ్ పార్టీలు, పెళ్లిపందిళ్ల అలంకరణ వంటి వ్యాపారాలకు డిమాండ్ పెరుగనుంది. పత్రికలు, క్యాటరింగ్, ఫొటో, వీడియోగ్రాఫర్లకు డబ్బులు వచ్చేకాలం ఇది.

ఆగస్టు 23 వరకు మంచి ముహూర్తాలు

ఈ నెల 25 నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాసం శుభకార్యాలు చేసుకునేందుకు యోగ్యమైనది. పెళ్లిళ్లు, కేశఖండనం, గృహ ప్రవేశాలు వంటివి జరుపుకోవచ్చు. ఈ మాసం శుభకరమైనది.
– కామేశ్వరశర్మ, వేదపండితుడు

పీ–4 సర్వేను వేగవంతం చేస్తాం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాకు సంబంధించి పీ–4 సర్వేను వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం వివరించారు. జిల్లాల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మన్యం జిల్లాలోని బంగారు కుటుంబాల్లో దాదాపు 50 శాతం సర్వే పూర్తయిందన్నారు. గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, మరింత వేగవంతం చేస్తామని తెలియజేశారు. సమావేశంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డీఆర్‌ఓ కె. హేమలత, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి పాల్గొన్నారు.

• మూతపడిన మరో బడి



విజయనగరం జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ఎనిమిది ప్రాథమిక పాఠశాలలు మూతపడగా, తాజాగా దత్తిరాజేరు మండలం వంగర పంచాయతీ మధుర గ్రామమైన ముద్దానపేట ప్రాథమిక పాఠశాలకు తాళంపడింది. సుమారు 30 కుటుంబాలు నివసిస్తున్న గ్రామంలో గతేడాది వరకు ఇద్దరు విద్యార్థులు (3వ తరగతి, ఒకటో తరగతి) చదివేవారు. వారు కూడా మూడురోజుల కిందట టీసీలు తీసుకుని వెళ్లిపోవడంతో పాఠశాలకు తాళం వేసినట్టు ఎంఈఓ–2 సుధాకర్ తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడిని ఎమ్మార్సీకి పంపించామని, ఉపాధ్యాయులు సెలవు పెట్టిన చోట ఆయనను బోధనకు పంపిస్తామన్నారు. – దత్తిరాజేరు


• కళ తప్పిన సచివాలయం



చిత్రంలో కనిపిస్తున్నది వేపాడ మండలంలోని నీలకంఠరాజపురం సచివాలయం. గతంలో ఇక్కడ 11 మంది సిబ్బంది విధులు నిర్వర్తించేవారు. వ్యవసాయ, సంక్షేమ, పశుసంవర్థక, రక్షక, సాంకేతిక, విద్యాసంబంధ, రెవెన్యూ, వైద్య తదితర సేవలు గ్రామస్తులకు అందేవి. ఇప్పుడు 11 పోస్టుల్లో ఆరు ఖాళీగా ఉన్నాయి. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రసూతి సెలవులో ఉండడంతో ముగ్గురు సిబ్బంది, ఒక పంచాయతీ కార్యదర్శి మాత్రమే అందుబాటులో ఉన్నారు. వీఆర్‌ఏ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, రైతుసేవా కేంద్రంలో వీఏఏ, వీఈఏ, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శితో పాటు ఏఎన్‌ఎం, మహిళా పోలీస్, సర్వేయర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పూనుకుందని, అందుకే సిబ్బంది సంఖ్యను తగ్గిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. – వేపాడ

అదును దాటుతున్నా.. అందని ఎరువు!

- బొండపల్లి మండలంలో 16 రైతు సేవా కేంద్రాలు (రైతు భరోసా కేంద్రాలు) ఉన్నాయి. ఇందులో ఐదు రైతు సేవా కేంద్రాలకు ఎరువులు వచ్చాయి. మిగిలిన 11 ఆర్ఎస్‌కేలకు ఎరువులు సరఫరా కాలేదు.
- దత్తిరాజేరు మండలంలో 17 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరు కేంద్రాలకే ఎరువులు సరఫరా అయ్యాయి. మిగిలిన కేంద్రాలకు సరఫరాకాలేదు. రైతులు ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి.



- వంగర మండలంలో రైతు సేవా కేంద్రాలకు ఇంకా ఎరువులు చేరపోగా ప్రైవేటు డీలర్ల వద్ద మాత్రం దొరుకుతున్నాయి.
- మెంటాడ మండలంలో 19 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఏ రైతు సేవా కేంద్రానికి కూడా ఎరువులు రాలేదు.



డీఏపీ బస్తాలు

- అధిక రైతు సేవా కేంద్రాలకు సరఫరా కాని ఎరువు
- కొన్నిచోట్ల వచ్చినా టీడీపీ నాయకుల ఇళ్లకు తరలింపు
- ఆవేదనలో రైతాంగం



జామి మండల కేంద్రంలో ప్రైవేటు డీలర్ దుకాణం వద్ద ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో ఖరీఫ్ పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. వరితో పాటు మెట్ట భూముల్లో సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, ఇతర కూరగాయల పంటలకు ఎరువు వేసుకునే అదును వచ్చింది. ఎరువు మాత్రం రైతులకు అందని దుస్థితి. రైతు సేవా కేంద్రాలకు కూడా అరకొర ఎరువు వస్తుండడం, వచ్చిన ఎరువును అధికార పార్టీ నేతలు తమ ఇళ్ల వద్ద డంప్ చేస్తుండడంతో వివాదాలు తలెత్తుతున్నాయి. జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువును తెప్పించడం, నిల్వ చేయడంలో కూటమి ప్రభుత్వానికి ముందుచూపు కొరవడడమే దీనికి కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీజన్ ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. రైతు సేవా కేంద్రాల కంటే ప్రైవేటు డీలర్లకు ఎరువు సరఫరాకే ప్రభుత్వం అధిక ప్రాధన్యమిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేలలోనే రైతులకు కావాల్సిన ఎరువులు ప్రభుత్వ ధరకు లభించేవని, ఇప్పుడు ఎరువు కోసం పరుగుతీయాల్సి వస్తోందని వాపోతున్నారు.

30 శాతం సరఫరా చేస్తాం..

జిల్లాలో అన్ని పంటలు కలిపి 22,045 హెక్టార్లలో సాగయ్యాయి. ఎరువులు ప్రైవేటు డీలర్లకు 50 శాతం, మార్కెఫెడ్ ద్వారా 50 శాతం సరఫరా చేస్తాం. మార్కెఫెడ్ 50 శాతం ఎరువుల్లో 30 శాతం రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తాం. సొసైటీలకు 1026 టన్నులు, ఆర్ఎస్‌కేలకు 2,336 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్లకు 3,480 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశాం. సొసైటీలకు 635 మెట్రిక్ టన్నుల డీఏపీ, ఆర్ఎస్‌కేలు, ప్రైవేటు డీలర్లకు 3484 మెట్రిక్ టన్నులు డీఏపీ సరఫరా చేశాం.
– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

కేటాయింపు ఇలా..
ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు 50,830 మెట్రిక్ టన్నుల ఎరువు కేటాయించారు. ఇందులో యూరియా 25,443 మెట్రిక్ టన్నులు, డీఏపీ 12, 824, పొటాష్ 2,236, కాంప్లెక్సు ఎరువులు 8,876, సింగ్ సూపర్ ఫాస్ఫేట్ 1452 మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఇవి ఇంకా రైతుకు అందలేదు.

పంటల సాగు వివరాలు..
జిల్లాలో వరి, మొక్కజొన్న, గోగు, పత్తి, చెరకు, అపరాలు తదితర పంటల సాధారణ విస్తీర్ణం 1,16,993 హెక్టార్లు కాగా ఈ నెల 19వ తేదీనాటికి జిల్లాలో వరి పంట 7,464 హెక్టార్లు, జొన్న 5, మొక్కజొన్న 7,457, అపరాలు 19, వేరుశనగ 46, నువ్వులు 3,799, పత్తి 1507, గోగు 15, చెరకు 1729 హెక్టార్లలో సాగైంది. పంటకు వేసేందుకు అవసరమైన ఎరువు దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉండేది 20.. రిజిస్టర్‌లో 127 మంది

- బొబ్బిలి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తప్పుడు లెక్కలు

బొబ్బిలి: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహంలో 20 మంది ఆశ్రయం పొందుతుండగా, రిజిస్టర్‌లో 127 మందిని చూపిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే విషయం అందరినీ విస్తుగొలుపుతోంది. ఏడాది కాలంగా నడుస్తున్న ఈ అవినీతి తంతుపై కలెక్టర్ అంబేడ్కర్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడం, ఆయన ఓ అధికారిని దర్యాప్తుకు పంపించడంతో అసలు విషయం బయటపడింది. ఉన్నదానికంటే ఆరింతలు ఎక్కవ మంది విద్యార్థులను చూపిస్తూ నిధులు గోల్‌మాల్ చేసిన తీరు ఇప్పుడు అందరినీ విస్మయపరుస్తోంది. ఏడాదిగా ఎంతమేర ప్రజాధనం కాజేశారన్న లెక్కలు వెలికితీసే పనిలో అధికారులు ఉన్నట్టు సమాచారం . దీని నుంచి బయటపడేందుకు సంబంధిత వార్డెన్ అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్టు తెలిసింది. అయితే, ఏడాదిగా హాస్టల్‌లో సాగుతున్న అవినీతి తంతుపై ఐడీడీఏ అధికారులు ఆరా తీయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో పర్యవేక్షణ అధికారులకు వాటా ఉందా అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలోని రికార్డులను పట్టించుకోకుండా నిధులను ప్రతీ నెలా విడుదల చేయడంలో అధికారుల ఆంతర్యం అర్థంకాని ప్రశ్నగా మిగిలింది. హాస్టల్‌లో దర్యాప్తు అంశాన్ని ఆర్‌ఐ రామ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా కలెక్టర్ కార్యాలయం నుంచి కొన్ని అంశాలపై విచారణ చేయాలని ఆదేశాలు వచ్చాయని, విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు గురువారం రాత్రి అందజేసినట్టు తెలిపారు. ఏఏ అంశాలపై విచారణ జరిపామన్నది చెప్పకూడదన్నారు.

క్లుప్తంగా

తిరుమల సన్నిధిలో కోలగట్ల కుటుంబం



తిరుమలలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, కుటుంబ సభ్యులు

విజయనగరం: తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని భగవంతుడిని ఆయన వేడుకున్నారు.

యథేచ్ఛగా పచ్చని జీడి చెట్ల నరికివేత



అనంతగిరి వద్ద వంట చెరకుగా తరలుతున్న జీడి కలప దుంగలు

భామిని: మండలంలోని పచ్చని జీడి తోటలు నేలమట్టం అవుతున్నాయి. రైతులకు ఆదాయ వనరులు కల్పించే జీడిమామిడి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో కొందరు అక్రమార్కుల చేతిలో ఈ చెట్లు కలప దుంగలుగా మారుతున్నాయి. అనంతగిరి వద్ద జీడి తోటలను గురువారం నరికివేసి అక్రమ రవాణా చేశారు. పచ్చని చెట్లు నరికివేతకు గుర్తై వంట చెరకుగా తరలిపోతున్నాయి. వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. లారీలు, వ్యాన్లతో జీడి చెట్లను నరికివేసి కలప దుంగలుగా మార్చి ఇక్కడ నుంచి తరలిస్తున్నారు. మండలంలోని ఎక్కువగా బురుజోల, బిల్లుమడ గ్రామాల్లో జీడి తోటలు నేలమట్టం అవుతున్నాయి.

శివాలయంలో చోరీ



నగిరేశ్వర శివాలయంలో హుండీని పగులగొట్టిన దొంగలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామంలో నగిరేశ్వర శివాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. భక్తులు కానుకలు సమర్పించే గుడిలోని హుండీని పగులగొట్టి సుమారు పదివేల రూపాయల వరకు నగదు, ఇతర ఆభరణాలను దొంగలు కొల్లగొట్టినట్టు ఆలయ పూజారి కొండేటి చందు గురువారం గ్రామపెద్దలకు తెలియజేశారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికి ఇది మూడో సారి జరిగిన దొంగతనమని దొంగలను పట్టుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరారు. మరోమారు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, భక్తులు పోలీసులను కోరారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



జీఆర్పీ పోలీసులకు పట్టుబడిన సెల్‌ఫోన్ దొంగ

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వే పోలీసులు సెల్‌ఫోన్ల దొంగను గురువారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీరావు మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్ సిబ్బందితో రైల్వే ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి పట్టుబడ్డారన్నారు. పట్టుకుని విచారిస్తే ఆ వ్యక్తి వద్ద నాలుగు సెల్‌ఫోన్లు ఉండటంతో తమదైన రీతిలో విచారించారు. దీంతో రైళ్లో కోసం వేచి ఉన్న ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్లను దొంగిలించినట్టు ఒప్పుకున్నట్టు తెలిపారు. నిందితుడి నుంచి రూ.లక్ష విలువ గల నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం రైల్వే కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

యునానికి స్వీపరే దిక్కు..!

- ఏళ్ల తరబడి వైద్యుడిని నియమించని ప్రభుత్వం
- కాంపౌండర్‌ని కూడా బదిలీ చేసిన వైనం
- జిల్లా కేంద్రంలో వైద్య సిబ్బంది లేని దుస్థితి
- చికిత్స కోసం వచ్చిన రోగులు వెనుతిరిగి వెళ్లిపోతున్న వైనం



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో యునాని విభాగం

విజయనగరం ఫోర్ట్: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెబుతున్న కూటమి సర్కార్ మాటలు ప్రకటనలకే తప్ప అమలుకు నోచుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆయుష్ శాఖలో భాగమైన యునాని విభాగానికి స్వీపరే దిక్కు అయ్యారు. వైద్యులు, కాంపౌండర్ లేకపోవడం వల్ల ఈ విభాగానికి వైద్య సేవలు కోసం వచ్చే వారు వెనుదిరుగుతున్నారు. యునానిలో కొన్ని రకాల సమస్యలకు మంచి చికిత్స ఉంది. దీంతో ఎన్నో వ్యాధిగ్రస్తులు ఓర్పు చికిత్స కోసం వచ్చే రోగులకు చికిత్స అందని పరిస్థితి నెలకొంది.

వైద్యుని నియమించని ప్రభుత్వం

యునాని విభాగానికి ప్రభుత్వం వైద్యున్ని నియమించలేదు. ఇక్కడ పని చేసే కాంపౌండర్‌ను వేరే చోటుకు బదిలీ చేశారు. వైద్యుడు, కాంపౌండర్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం భర్తీ చేయలేదు. పోనీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందంటే అదీ లేదు. దీంతో స్వీపర్ కమ్ స్కావెంజర్(ఎస్‌సీఎస్) పెద్ద దిక్కుగా నిలిచారు. వైద్యుడు, కాంపౌండర్ లేనప్పటికీ ప్రతీ రోజు యునాని డిస్పెన్సరీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటున్నారు.

మందులు ఉన్నా అందించే దిక్కులేదు

యునానిలో చర్మ సంబంధిత సమస్యలు (బొల్లి మచ్చలు, తదితర వాటికి) కీళ్ల నొప్పులకు, దగ్గు, జలుబు, జ్వరం, గ్యాస్ట్రిక్, స్త్రీల వ్యాధులకు మంచి



విధులు నిర్వహిస్తున్న స్వీపర్ కమ్ స్కావెంజర్

మందులు ఉన్నాయి. అయినప్పటికీ వీటిని అందించే నాధుడే కరువయ్యాడు. యునాని వైద్యం గురించి తెలిసిన రోగులు ప్రతీ రోజూ వస్తుంటారు. అయితే చికిత్స అందించే వారు లేక పోవడం వల్ల వారు వెళ్లిపోతున్నారు.

జిల్లా కేంద్రంలో వైద్య సిబ్బంది కరువు

జిల్లా ప్రధాన కేంద్రంలోని యునాని డిస్పెన్సరీకి వైద్య సిబ్బంది లేని దుస్థితి నెలకొంది. యునాని డిస్పెన్సరీ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఉంది. దీంతో రోగులు వస్తారు. జిల్లా కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



యునాని మందులు

వాస్తవమే..

విజయనగరం యునాని విభాగానికి వైద్యుడు, కాంపౌండర్ లేని మాట వాస్తవమే. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. – డాక్టర్ రూప్సీలక్ష్మి, ఆర్‌డీడీ, ఆయుష్ శాఖ

ఈగల్ టీమ్‌కు చిక్కిన గంజాయి నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, వెనుక ముసుగులో నిందితులు

- పట్టుబడిన వారిలో యూపీకి చెందిన దంపతులు

విజయనగరం క్రైమ్: మూడు కార్లలో 120 కేజీల గంజాయిని రవాణా చేస్తున్న ఎనిమిది మందిని రాజాపులోవ జంక్షన్ వద్ద ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో పట్టుకున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. డీపీవోలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈగల్ టీమ్ సీఐ కల్యాణితో కలిసి వివరాలు వెల్లడించారు. ఈగల్ పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారంతో విజయనగరం నుంచి మూడు కార్లలో వస్తున్న ఎనిమిది మందిని రాజాపులోవ వద్ద అదుపులోకి తీసుకొని వారి నుంచి 47 ప్యాకెట్లలో ఉన్న 120 కేజీల గంజాయిని, తొమ్మిది సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. పట్టుబడిన ఎనిమిది మంది నిందితుల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా లంతాపూర్ బ్లాక్ బెల్లిక చెందిన కొర్రా కిరణ్(21), మనోజ్ బిసాయి(2), ఢిల్లీలోని పాత సీంపూర్‌కు చెందిన పాజిల్(30), యూపీలోని హాపూర్ జిల్లా లక్ష్మణపురకు చెందిన విజేంద్ర(46), బుదాన్ జిల్లా నక్రి జంగిల్‌కు చెందిన ముబ్బర్ అహ్మద్(43), అహ్రార్‌కు చెందిన అజ్మోహాన్(21), కాశగంజ్ జిల్లా కుల్లికి చెందిన సోను (34), శిల్పి(30)గా విచారణలో గుర్తించామన్నారు. నిందితులు గంజాయిని ఉత్తరప్రదేశ్, ఢిల్లీకు రవాణా చేయాలనే ఉద్దేశంతో ఒడిశా రాష్ట్రంకు చెందిన గంజాయి వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్నారని తెలిపారు. మరో నిందితుడు అజిత దడక అలియాస్ ఒజి అలియాస్ మహేష్ దడక పరారయ్యాడని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. వీరంతా ఒడిశాలోని గంజాయి వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి రైళ్లు, కార్లలో తరలించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో కార్లలో విజయనగరం మీదుగా విశాఖపట్నం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గంజాయిని పట్టుకోవడంలో చురుగ్గా వ్యవహరించిన భోగాపురం సీఐ కె.దుర్గాప్రసాద్, ఈగల్ సీఐ బి.కల్యాణి, ఎస్‌ఐ పి.పాపారావు, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఆయనతో పాటు డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు పోలీసు అధికారులు ఉన్నారు.

రామతీర్థంలో పునర్వసు పట్టాభిషేకం

- సీతారామస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



స్వామి సన్నిధిలో పట్టాభిషేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు గురువారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవన హోమం జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపంలో సీతారామస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించారు. ఉత్సవ మూర్తులకు రామాయణంలో పట్టాభిషేక సర్గ విన్నవించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫల రసాలతో అభిషేకం, పున రస్సు పట్టాభిషేకాన్ని జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, వరప్రసాద్, పవన్, రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

విజయనగరం క్రైమ్: నగరంలోని పోలీసు కార్యాలయానికి సమీపంలో ఉన్న కంటోన్మెంట్ సమీపంలో ఉన్న ఓ బిర్యానీ పాయింట్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య గురువారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ఇది కాస్త కొట్లాటకు దారితీసింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. బిర్యానీ పాయింట్ వద్ద ఉమర్, నజీర్ అనే వ్యక్తుల మధ్య మసీదు అభివృద్ధి విషయమై వివాదం తలెత్తింది. అది కాస్త వాదిద్దరి మధ్య కొట్లాటకు దారితీసింది. విషయం కంట్రోల్ రూమ్‌కు తెలియడంతో విజయనగరం వన్‌టౌన్ సీఐ ఆర్‌వీకే చౌదరి, ఎస్‌ఐలు రామ్‌గణేష్, లక్ష్మీప్రసన్నకుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఇద్దరిని విజయనగరం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు.



బిర్యానీ పాయింట్ వద్ద పోలీసు బందోబస్తు

ఈ వివాదం నేపథ్యంలో బిర్యానీ పాయింట్ వద్ద, మసీదు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

27న టీచర్ పోస్టులకు పరీక్ష

విజయనగరం అర్బన్: పట్టణంలోని సెయింట్ జోసెఫ్ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు ఎస్‌జీటీ పోస్టుల ఎంపిక పరీక్షను ఈ నెల 27న స్థానిక గురజాడ స్కూల్‌లో నిర్వహిస్తామని డీఈవో యు.మాణిక్యంనాయుడు గురువారం తెలిపారు. ఆ పోస్టులకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 11 నుంచి 12.30 గంటల మధ్య జరిగే పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందు హాజరు కావాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ ఐడీ)ను తీసుకు రావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన రమణ

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కనప రమణ (59) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రమణ రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఉదయం 7.30గంటల సమయంలో విధులకు టీవీఎస్ ఎక్సెల్‌పై బయలుదేరాడు. పొగిరి పీహెచ్‌సీ ఎదురుగా వచ్చేసరికి కళ్లు తిరగడంతో బైక్ అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి 108 సహాయంతో రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కోల్పోయామని, తమకెవరు దిక్కని కుటుంబీకులు రోదించారు. మృతునికి భార్య సీతమ్మ, కుమారుడు చిరంజీవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుమారుడు చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

కేరళలో కోన యువకుడు ఆత్మహత్య



గోవర్ధనరావు(ఫైల్)

మక్కువ: మండలంలోని కోన గ్రామానికి చెందిన మడక గోవర్ధనరావు(30) కేరళ రాష్ట్రంలో గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు...గోవర్ధనరావు కేరళ రాష్ట్రంలోని కాసరగోడ్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏమైందో తెలియదుగాని తాను అద్దెకుంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. గోవర్ధనరావు మృతి చెందాడన్న వార్త తెలిసిన తల్లిదండ్రులు రామకృష్ణ, చిన్నమ్మలు కన్నీరుమున్నీరయ్యారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹194

పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతం కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులకు సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని కన్నయ్యగూడ, కురుపాం మండలంలోని తోటగూడ గ్రామాల్లోని పీఎం జన్‌మన్ ఇళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. బిల్లుల చెల్లింపులపై లబ్ధిదారులతో మాట్లాడారు. కన్నయ్యగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ స్కూల్‌ను పరిశీలించారు. పాఠశాలకు అదనపు తరగతి గది మంజూరు చేస్తామన్నారు. అలాగే భద్రగిరి సీహెచ్‌సీని సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ దశలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆపై గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్‌ను సందర్శించి మార్గదర్శకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. పీఎం జన్‌మన్ కింద జిల్లాకు 5వేల గృహాలు మంజూరు కాగా, 1600 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని, 130 గృహాలు



కన్నయ్యగూడలో పీఎం జన్‌మన్ గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పూర్తయ్యాయన్నారు. మిగిలిన గృహాలు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తికావాల్సి ఉందన్నారు. అందులో భాగంగానే క్షేత్ర స్థాయి సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించినట్టు చెప్పారు. భద్రగిరి సీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్స్ ఎక్కువగా నమోదవుతున్న తరుణంలో బెడ్లు సరిపోవడం లేదని, నిర్మాణ దశలో ఉన్న కొత్త ఆసుపత్రి భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. బంగారుబాతంలో నెలకొన్న అల్పపీడనం వలన కలిగే దుష్ప్రభావాలను ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్ సహకారంతో ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు గ్రామ సచివాలయం ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూలతో వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మ చంద్రారెడ్డి, ఐటీడీఏ పీఓ బి.కనక దుర్గ, ఐటీడీఏ డీడీ ఆర్.కృష్ణవేణి, గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, తహసీల్దార్ ఎస్.శేఖర్, ఎంఈవో బి.చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ ఎం.వెంకటరావు తదితరులు ఉన్నారు.

సాగు భూమిని ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారు..!

- తహసీల్దార్‌ను ప్రశ్నించిన కాకర్లవలస గిరిజన రైతులు
- పట్టా లేకుండా సాగు చేసే హక్కు లేదు..
- వదిలి వెళ్లిపోవాలని తేల్చి చెప్పిన తహసీల్దార్

రామభద్రపురం: డి పట్టా భూమి అయినా.. దశాబ్దాల కాలంగా మా సాగులో ఉన్న భూమిని ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారని కాకర్లవలస గిరిజన రైతులు తహసీల్దార్ అజురఫీజాన్‌ను ప్రశ్నించారు. మండలంలోని కొట్టక్కి రెవెన్యూ, మిర్తివలస పంచాయతీ పరిధిలోని కాకర్లవలస, కారేడువలస గ్రామాల మధ్య 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు 187.08 ఎకరాల భూమిని రూ.7.48 కోట్లకు ఏపీఐఐసీకి విక్రయించింది. అయితే ఆ భూమిలో ఏపీఐఐసీ ఇప్పటి వరకు కనీసం ఒక్క పరిశ్రమ పెట్టలేదు సరికదా, భూమి ఎక్కడుందో? ఎలా ఉందో, ఎవరు ఆక్రమించుకున్నారో.. కనీసం కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏపీఐఐసీకి సంబంధించిన భూమిలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం కొంత భూమిని కేటాయిస్తూ ముందుగా రోడ్డు అభివృద్ధి కోసం రూ.7 కోట్లు నిధులు విడుదల చేయడంతో



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అజురఫీజాన్

నెల రోజుల క్రితం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బేబీనాయన, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శంకుస్థాపన కూడా చేసిన విషయం విదితమే. అయితే సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పుడు రోడ్డు అభివృద్ధి కోసం పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో ఏపీఐఐసీకి సంబంధించిన భూమే కదా అని ప్రస్తుతం సాగులో ఉంటూ పత్తి, మొక్కజొన్న, మామిడి, జీడి తోటలు సాగు చేస్తున్న గిరిజన రైతులకు కనీసం నోటీసు ఇవ్వకుండా జేసీబీతో ధ్వంసం చేశారు. దాంతో తమ సాగులో ఉన్న భూములలో ఎలా రోడ్డు వేస్తారని వారు ప్రశ్నించారు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజురఫీజాన్ ఆధ్వర్యంలో ఏపీఐఐసీ జేఈ రాజేష్‌కుమార్, ఎస్‌ఐ వి.ప్రసాదరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, సీపీఎం నాయకుడు బలస శ్రీనివాసరావు, గిరిజన రైతులు సమావేశమయ్యారు. సమావేశంలో భూ రికార్డులు పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కాకర్లవలసలో ఉన్న మొత్తం సుమారు 462 ఎకరాల డి పట్టాతో పాటు, పోరంబోకు సంబంధించిన భూమి ఉందని, అందులో గిరిజన రైతులకు 266 ఎకరాల భూమి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కింద ఇచ్చామన్నారు. అలాగే 187.8 ఎకరాలు రూ.7.48 కోట్లకు ఏపీఐఐసీకి విక్రయించిందన్నారు. కొండ పక్కన ఉన్న ప్రాంతంలో మీకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇస్తే ఏపీఐఐసీకి కేటాయించిన భూమిలో మీరు ఎలా సాగు చేస్తారని? ఇది డి పట్టా భూమి అని మీరు సాగు చేసే కుదరదని, వదిలి వెళ్లిపోవాల్సిందేనని తేల్చి చెప్పేశారు. భూమి ఎక్కడ ఇచ్చారో అక్కడకు వెళ్లి సాగు చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం గిరిజన రైతులు మాట్లాడుతూ సాగులో ఉన్న భూములను ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు అంటూ పెద్దల స్వార్థం కోసం మా పేదల భూములు లాక్కోవడం సమంజసం కాదని అందోళన వ్యక్తం చేశారు. చావనైనా చస్తాం.. కానీ భూములు వదిలే



కాకర్లవలసలో గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల వద్ద రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్, సర్వేయర్



జేసీబీతో ధ్వంసం చేసిన మామిడి మొక్కలు

ప్రసక్తే లేదని గిరిజన రైతులు తేల్చి చెప్పేశారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. సర్పంచ్ మజ్జి రాంబాబు మాట్లాడుతూ మిర్తివలస పంచాయతీ పరిధిలో ఉన్న సర్పంచ్‌గా, గ్రామ ప్రజ సంతకాలు లేకుండా కొట్టక్కి రెవెన్యూ పరిధిలో ఉన్నంత భూమి సర్పంచ్‌గా ఆ సర్పంచ్ సంతకంతో తీర్మానం ఎలా చేస్తారు? నోటిఫికేషన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు పార్టీ మద్దతుగా తాము నిలబడతామన్నారు. మండల సర్వేయర్ వి.సాయికుమార్, కొట్టక్కి వీఆర్వో మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.